


"మరింక నే వెళ్తాను" లేచాడు రాజా రావు.

మిత్రబృందం అంతా అలాగేనన్నట్లు తలూపారు. ఆ బృందంలో కొత్తగా వచ్చిన వ్యక్తి సతీష్. అతను మాత్రం. "అప్పుడేనా యింకా అరవ్వాకాలేదు. వెళ్లేంచేస్తారు? కూర్చోండి" అన్నాడు.

"భలేవాళ్ళే... పెళ్ళయితే మీకు తెలుస్తుంది. నో పుడ్డు...నో బెడ్డూ అని ఎవ తనిపించుకుంటారులెండి" చిలిపిగా నవ్వి వెళ్ళిపోయాడు.

ఆశ్చర్యపోయాడు సతీష్.

సతీష్‌కు మనుషుల్ని స్టడీ చెయ్యడం అలవాటు- సైకాలజీ స్టూడెంటు కాకపోయినా చాలామటుకు అతని అంచనాలు కరక్టే అవుతాయి. రాజారావుకు పెళ్ళయిందా? అని తర్కిస్తే- అయి వుండదనీ అతని మనసు చెపుతుంది. పాతికేళ్ళుంటాయి. రాజారావుకి- పెళ్ళి కాకూడదని రూలేం లేదు. వయసుపరమైన ఆకర్షణ అతనిలోనూ ఉంది- అయినా పెళ్ళయి వుండదనీ అనిపిస్తుంది. ఒక వ్యక్తి తనకు సంబంధించిన ఒక విషయం గురించి,పదిమందికి తెలియాలని

కావాలని ప్రయత్నిస్తున్నాడంటే... రెండే రెండు కారణాలు వుంటాయి. ఆ విషయంలో అతడు ఊహాలోకంలో తేలిపోతూ ఎదుటివాడిచేత నమ్మించగలిగితే అలాగన్నా తృప్తిపడటానికి. లేదా ఆశించిన విధంగా లేకపోతే అలా ఊహల్లో విహరించడం.

ఈ లెక్కన రాజారావుకి పెళ్ళయినా కాకుండా ఉండాలి. లేదా అందులో అతడు విఫలమైనా అయివుండాలి. తన వూహ కరక్టా కాదా అన్నది ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూనే ఉంటాడు సతీష్. సాధారణంగా తన అంచనాలు తప్పవు. చూద్దాం ఏది యిప్పుడేగా పరిచయం' అనుకున్నాడు సతీష్.

అది ఓ పబ్లిక్ పార్క్.

అక్కడ ఏర్పడిందీ మిత్ర బృందం.

పిల్లి విషయాల దగ్గర నుంచి-పీరియడ్ మాటర్సు వరకూ మాట్లాడుకుంటారు వాళ్ళు. బార్‌లో పనిచేసే స్టీవర్డ్ సురేంద్ర-కాలేజీ చాలించి జాబ్ హైరిల్లో ఉన్న మురళి- ఇప్పుడిప్పుడే రచయిత అవుతున్న మోహన్- యింకా ఇంటర్ చదువుతున్న వేణులాంటి యువతరంతో పాటు...రిటైర్డు పోస్టుమాస్టరు రంగారావుగారు...మనల్ని ఆడించడానికి తెచ్చే యాదగిరిగారు...ఆ బృందం సభ్యులు. రాజారావు...ఓ బేంక్‌లో మెసెంజర్.

ఇకపోతే సతీష్ మాధవ్ పూర్తి పేరుగా గల సతీష్ ఓ ట్యుటోరియల్ కాలేజీలో ట్యూటర్. కొలీగ్‌తో ఓ రూమ్ తీసుకుని ఉంటున్నాడు. అతనిదీ ఊరు కాదు. ఆ బృందంతో కలసి మూడు రోజులే అయింది.

సతీష్ కెందుకో నవ్వు వచ్చింది.

గుండెల్లో ఎక్కడో కలుక్కుమన్న విషయాన్ని తేలికగా మార్చేయగల మంత్రగాడు సతీష్.

అందుకే హాయిగా నవ్వగలుగుతాడు.

పాతికేళ్ళున్నప్పుడు ఇరవైలా కనపడ్డాడు. ఇప్పుడు ముప్పైలో వున్నా పాతికేళ్ళవాడిలా కనపడుతున్నాడు.

సాధారణంగా ఎదుటివ్యక్తి వయసు చెబితే దానికి కనీసం ఓ రెండుమూడు సంవత్సరాలైనా కలిపిచూస్తేగాని...ఆ వ్యక్తికి వయసుకు సంబంధం కుదరదు.

అలాంటిది సతీష్ ఉన్నదున్నట్లుగా ముప్పై అనగానే ఇంకా తగ్గించి చూస్తారే కాని ఎక్కువచేసి చూడబుద్ధి కాదు.

"రాజారావుకి పిల్లలా?" మామూలుగా అడుగుతూ తర్కించుకుంటున్నాడు.

"లేదనుకుంటాను-ఆ మధ్యనెప్పుడో గర్భం పోయిందని అన్నాడు."

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు సతీష్.

యింటికి సమయానికి వెళ్ళాలనే తహతహ-ఇంత యిదిగా ఉంటుందా పెళ్ళయినవాడికి. ఆరంభంలో ఉంటుందేమో? అస్తవ్యస్తమైన వివాహ వ్యవస్థ భార్యాభర్తలని అంతలా కట్టి ఉంచగలుగు

తుందా?-అదర్శదాంపత్యమో అన్యోన్య దాంపత్యమో అరుదుగా లభించే వరం అనుకుందామంటే-ఇలా ఉంటుందా? నో పుద్దు-నో బెడ్డూ లాంటి ప్రశ్నలు వేద్దా మనుకున్నాడుగాని భావ్యంగా ఉండదని ఆగిపోయాడు.

అలా ఆ బృందంలోని వారందరి కన్నా రాజారావు పైనే సతీష్ ధ్యాసంతా కేంద్రీకరించాడు.

అక్కడికి రాజారావు తప్ప మిగతా వాళ్ళంతా బ్రహ్మచారులు- సంసార సౌఖ్యం ఇంచుమించుగా అనుభవించేసిన వాళ్ళను.

"మీకు పెళ్ళయి ఎన్నాళ్ళయింది రాజా రావు?" ఒకసారి మిత్రబృందం అంతా ఇంకా చేరలేదు. సతీష్ రాజారావులు ఇద్దరే ఉండగా అడిగాడు సతీష్.

అనుకోని ప్రశ్నకు తడబడిపోయాడు.

"ఐదేళ్ళయింది." నిలద్రొక్కుకుని యిచ్చిన సమాధానమని గ్రహించాడు సతీష్. తన అనుమానం నిజమే అనిపించింది సతీష్‌కి.

నిజానికి రాజారావు సంసారి అయినా తన కనవసరం.కాని తనకున్న సైకాలజీ పరిజ్ఞానాన్ని పరీక్షించుకోవాలి. అదే సతీష్ ధ్యేయం.

"పిల్లలు" అర్థోక్తిలో ఆగిపోయాడు.

"అప్పుడే ఎందుకండి. ఆనందానికి అడ్డు- ఇప్పుడప్పుడే వద్దనుకున్నాం."

"మరీ... గర్భం ఏదో పోయిందన్నారు."

ఆశ్చర్యపోయాడతడు. అయినా తమాయించుకున్నాడు.

"ఏదో పొరపాటు జరిగిందిలెండి-" నవ్వలేక నవ్వాడు.

ఇంతకుమించి మాట్లాడితే అసహనం పెరిగి- అసలు నా విషయాలు మీకెందుకు అనవచ్చు అన్న ఇంగితంలో అంతటితో ఆగాడు సతీష్.

మరో రోజు...

"నేను వెళ్ళాలి" అంటూ లేచాడు రాజారావు.

ఎవరూ ఏ కామెంట్ చేయలేదు. సతీష్ కూడా ఊర్కొన్నాడు.

"సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం ఈ రోజు- అందుకనే తొందరగా బయలు దేరాను- దారిలో మల్లెపూలు కొని పట్టు కెళ్ళాలి."

తనే చెప్పాడు ఎవరో అడిగినట్లు-

"ఏ సినిమాకి?" ఉన్నట్లుండి అన్నాడు సతీష్.

"మా ఆవిడకి గోవింద సినిమాలంటే ఇష్టం- నాకు చిరంజీవి సినిమాలంటే ఇష్టం. టాస్ వేస్తాం- దాన్నిబట్టి..." హుషారుగా నవ్వాడు.

ఈ మధ్యన రాజారావులో వచ్చిన మరో మార్పు అది. సతీష్ వివరా లడగడం అతడికి పూపునిస్తుంది.

ఓ బ్రహ్మచారి కుర్రాడు. తన సంసార జీవితంపైపు-ఆశగానో మరేవో




గావో చూస్తున్నాడు. తను అతనికంటె ఆనందం అనుభవిస్తున్నాడు. తనకి గుర్తింపు వస్తుంది. ఇదివరకు వెళ్తానంటే-ముభావంగా ఉండేవాళ్ళు అందరు ఇప్పుడలా కాదు సతీష్ ఏవేవో ప్రశ్నలు వేస్తాడు. తనకు ఏవేవో చెప్పాలని పిస్తుంది. ఈ విషయం సతీష్ గమనించక పోలేదు.

మరో రోజు...

"ఈ రోజు తొందరగా వెళ్ళాలి... బీచ్ కు వెళ్దామనుకుంటున్నాం."

"అయితే వెళ్ళండి-ఇప్పుడే అయిదున్నర అయిపోతుంది- ఆరు దాటాక యింకేం వెళ్తారు?" సతీష్ అన్నాడు.

సమాధానం రెడీగా ఉంచుకున్నాడులా వుంది రాజారావు. తపీమని అన్నాడు.

"చీకటైతేనే జంటలకు బాగుంటుందండి- మీకు తెలియదులెండి" ఒక రకమైన సిగ్గును అభినయిస్తూ అన్నాడు.

ఏదో వదవారు- పది హేనేళ్ళ ప్రాయంలో ఎఫైర్స్ అయితే సమవయస్కుల మధ్య అలా అన్నా బాగుంటుంది. భార్య విషయంలో ఎంత రసికుడైనా అలా బాహాటంగా అంటాడా?

ఇదే అదనుకున్నాడు సతీష్.

"భలేవారండి- మీ అన్యోన్య దాంపత్యం గురించి అలా ఊహిస్తూ పోతారే కాని మీ దంపతుల దర్శన భాగ్యం మా కెందుకు కల్పించరు? ఏదో ఓ సందర్భం కల్పించుకుని చిన్నపార్టీకి పిలుద్దురూ!"

అనుకున్నట్లే రాజారావు మొహంలో రంగులు మారాయి.

అయినా తమాయించుకున్నాడు.

"రానీయండి- ఆ సమయం-" అని తప్పించుకోవచ్చు- ఏమంటే ఏమౌతుందో అనే సందిగ్ధం అతడి వదనంలో చాలా సేపు తారట్లాడింది. సైకాలజీ స్టడీ

చేస్తున్న సతీష్ అది గమనించకపోలేదు.

"అదేమిటోగానండి- స్నేహితులని ఇంటివరకు తేఋద్దేయదండి- సారీ- ఏమనుకోకండి" తెగించి అనేసాడు.

అలాంటి సమాధానికి సిద్ధంగా వున్నాడు సతీష్.

"అకస్మాత్తుగా వచ్చాననే అనుకోండి మీ యింటికి. ఏం చేస్తారు?"

సతీష్ ఇంత చనువు ప్రదర్శించే అవకాశం ఇచ్చిండే రాజారావు. ప్రారంభంలోనే కట్ చేయక ప్రోత్సహిస్తూ వచ్చారు. ఇప్పుడెలా?

చిరునవ్వు నవ్వుతున్నాడు సతీష్.

"మా ఇల్లు మీకు తెలుసా?" తిరుగు ప్రశ్న వేసాడు.

"ఏం, మీరు చెప్పరా?" వెంటనే అన్నాడు సతీష్.

"మీరు భలే హాస్యాలాడుతారుగాని- సినిమాకి టైమైపోయింది, మళ్ళీ కలుద్దాం" అని నవ్వు పులుముకుని వడివడిగా సాగిపోయాడు రాజారావు.

మిత్రబృందం వింతగా చూశారు.

"సతీష్‌గారూ-రాజారావు విషయంలో మీరు ప్రత్యేక ఆసక్తి కనపరుస్తున్నారు- రాజారావుకి పెళ్ళయి ఉండదనే మీ అనుమానం కూడా కదూ." రచయిత మోహన్ అన్నాడు.

రచయితకి ఆ మాత్రం స్పార్క్ ఉండాలి. అందిస్తే అల్లుకుపోగలగాలి. కాని గుంభనగా-ఎవరి జీవితాలు పబ్లిక్‌గా వీధిన పడేస్తే ఎవరూరుకుంటారు.

అప్పటికి నవ్వుతోనే సమాధానమిచ్చాడు సతీష్. మోహన్ ఊరుకోలేదు. ఆ తరువాత రోజు ఒంటరిగా ఉన్నప్పుడు అడిగాడు.

"మన ఊహ వాస్తవమే-సతీష్‌గారు. నేనొకసారి రాజారావుని వెంబడించాను అనుమానం వచ్చి- ఈ పార్కు నుండి డైమండ్ పార్కుకువెళ్ళి కూర్చునేవాడు. నా కతని మీద సానుభూతి వుంది. చాలా వివరాలు లాగేను. రోగిష్టి తల్లి-ఎదిగిన ఇద్దరు చెల్లెళ్ళు- షోకిలా తమ్ముడు; అతను కోరుకున్న జీవితాన్ని- ఊహల్లోకి తెచ్చుకుని- తనేకాదు ఇంకొందరిలోకి కూడా వాటిని ప్రవేశపెట్టి- తృప్తి పడుతున్నాడు. పడనీయండి."

సతీష్ చాలా సేపు మౌనంగా ఉన్నాడు.

"అందరికీ ఈ విషయం తెలుసా?"

"నా ద్వారా తెలుసు- అందుకే- అంత నిర్లిప్తంగా ఉంటాం" అన్నాడు మోహన్.

"మనం స్నేహితుల్లా కలుస్తున్నాం- ఊహా ప్రపంచంలో బ్రతక నేర్వడం మంచిది కాదు. మెంటల్ ఎఫెక్టుకు దారితీస్తుంది. మనం అతడిని ఆ ఫాల్స్ ప్రిస్టేజినుండి బయటపడేయాలి. ఒక్కొక్కళ్ళకి ఒక కథ ఉంది. అలాగే నాకూ ఓ కథ ఉంది..." ఆగాడు సతీష్.

రచయితకుండే సహజమైన కుతూహలం కొద్ది కుతూహలంతో ముందుకు

వంగాడు మోహన్.

"ఇప్పుడు కాదు. నువ్వు-నేను రాజారావు ఇంటికి అతడిని వెంబడించి వెళ్దాం. అక్కడ అతడిని వాస్తవికతలోనికి వెన్నుతట్టి లాగి- నా కథ వినిపిస్తాను- ఓ.కే."

అలాగే నన్నట్లు తలవూపాడు మోహన్.

"అసలు నీకెలా తట్టింది మోహన్-" ఉత్సుకతగా అడిగాడు సతీష్.

మోహన్ చెప్ప నారంభించాడు.

"ఓ లైబ్రరీ మేట్ కలిసాడు, గ్రాడ్యుయేట్- కాని పెసిమిస్ట్ - చాలామంది అలాంటివారే. అదలా ఉంచుదాం- మొదట్లో బాగానే ఉండేవాడు. రామరామ మా యింట్లో టివి మా యింట్లో వివిఆర్, మా యింట్లో గ్రైండర్-మా యింట్లో ఎక్వేరియమ్ అనడం మొదలుపెట్టాడు. అయినదానికి- కానిదానికి అనడం అలా వుంది- రాత్రి పదిదాటాక వచ్చే టివి ప్రోగ్రామ్‌లు మీరు చూసారా! అనడం- ఓహో మీకు టి.వి. లేదుగదూ అనడం, నేపిరోజు ఫలానా హిందీ సినిమా మా వివిఆర్‌లో చూసాననడం. అది యింకా రిలీజ్ కాని హిందీ సినిమా. ఆ సినిమా గురించి వివరాలడిగితే తప్పదాటు సమాధానాలీయడం- క్లయిమాక్స్ గురించి అడిగితే- సస్పెన్స్ అనడం చేసేవాడు. వాళ్ళింట్లో సామాన్ల గురించి ప్రతి సావు గంటకోసారి ప్రసక్తి వచ్చేది- ఇదెక్కడి తద్దినం అనుకునేవాళ్ళం. అతనెలాంటి డ్రస్ వేసేవాడంటే- కనీసం దార్నింగ్ కూడా కాదు. చేతితో చిరుగులు కుట్టిన షర్టు, పేంట్‌లు- అతను చెప్పేవదానికి దీనికి పొత్తు కుదిరేది కాదు- అలా వుండగా- ఓసారి- అతనూ మేము కేంటిన్‌లో టీ త్రాగి అతనలా వెళ్ళిపోతే యిలా మేం వస్తున్నాం. మా పాత మిత్రుడొకడు వెనకనుంచి మమ్మల్ని పిలిచాడు. మేం తిరిగి చూసి ఆగాం. అతడు మాకు అతని గురించి చెప్పాడు. అతను మా మిత్రుని పక్క యింట్లో ఓ నేవల్ ఆఫీసర్ ఇంట్లో కుక్‌గా ఉంటున్నాడట. చాలా హీనంగా చూస్తారట వాళ్ళు. వాళ్ళు లోపల వివిఆర్‌లో సినిమాలు చూస్తే ఈయన బయట పిల్లల్ని ఆడించాలట. ఎప్పుడూ చివాట్లు పడుతుంటాయట. అలా చాలా జాలిగా చెప్పాడు. అప్పుడు అనిపించింది అతడు ఊహాలోకంలో విహరిస్తున్నాడని, అతడితో పోల్చుకుంటే రాజారావు నయమే కదా!- ఏమంటారు?" నవ్వుతూ మోహన్ అన్నాడు.

"నిజమే కాని- చివరికి ఆ అబ్బాయిని- మీరు నిలెయ్యలేదా?" అడిగాడు సతీష్.

ఎంతైనా కథకుడు కదా హావభావాలతో చెప్పాలాయె- ఒక నిట్టూర్పు విడిచాడు. "నేను అలాంటి విషయాల్లో సున్నితంగా ప్రవర్తిస్తాను.ఎవరిలోకం వాళ్ళది

అనుకునేవాడిని..."

రాజారావుని జాగ్రత్తగా వాస్తవ జగత్తులోకి రప్పించాలి. ఆ విషయమై మోహన్‌తో చాలా సేపు మాట్లాడాడు.

అక్కడకు వెళ్ళి ప్రవర్తించాల్సిన తీరు మాట్లాడాల్సిన పద్ధతీ చెప్పాడు.

ఆ రెండవరోజు-ఎలాగైతేనేం చేరు కున్నారు రాజారావు ఇల్లు. అతడు ఇంట్లో ప్రవేశించిన పది నిముషాలకు వీళ్ళు ప్రవేశించారు.

అది చిన్న ఇల్లు.

ఎక్కడి వస్తువులు అక్కడ లేవు.

స్టాండుకు వుండాల్సిన బట్టలు కుర్చీల మీదా- బుక్ షెల్ఫులో వుండాల్సిన పుస్తకాలు చిందరవందరగా బల్లమీద ఉన్నాయి. ఒక యంగ్‌చాప్ బబుల్‌గమ్ నములుతూ 'హెరాల్డ్ రాబిన్స్' చదువు తున్నాడు. అతణ్ణి రాజారావు తమ్ముడిగా గుర్తించారు.

అతను వాళ్ళనన్నను పిలిచి బయటకు వెళ్ళిపోయాడు వీళ్ళను చూసి నీరుగారి పోయాడు రాజారావు. కూర్చోమనక తప్పలేదు. కూర్చున్నారిద్దరు.

"మొత్తం మీద...చూసారా- మేం వచ్చేశాం" ప్రారంభంగా అన్నాడు సతీష్.

ఊరుకున్నాడు రాజారావు.

అలా కాసేపుండి "చాయ్ తెస్తా నుండండి" అని లోపలికి వెళ్ళాడు. వారించలేదు యిద్దరు. అతడికి కూడా స్థిమితపడడానికి అవకాశం యివ్వాలి.

పావుగంటకు చాయ్ తీసుకుని వచ్చాడు రాజారావు. అతని మొఖం కళ తప్పి వుంది. చాయ్ సిప్‌చేస్తూ ఉపక్రమిం చాడు సతీష్.

"నా గురించి మీరే మనుకుంటు న్నారు?"

"ఏమనుకుంటాను....?" వీళ్ళు నని లాడు రాజారావు.

"నాకింకా మీరంతా పెళ్ళి కాలేదను కుంటున్నారు కాని అయింది. ఇద్దరు పిల్లలు కూడా.మా అమ్మకి నేనొక్కడ్నే. సైకాలజీ ప్రకారం-మమ్మల్ని సవ్యంగా కాపురం చేయనీయలేదు ఆవిడ. అశాంతి అలజడి-స్థిరంగాలేని సంపాదన-ఆవిడ తరపువాళ్ళ జోక్యంతో-నా జీవితం తీవ్ర సంక్షోభానికి గురైంది. నే మాహిం చిన జీవితం తలక్రిందులయింది. తిరిగి చక్కబెట్టుకుంటున్నాను. జీవనసౌధాన్ని పునర్నిర్మించుకుంటున్నాను. నిజం చెప్పా లంటే కొందరు వ్యక్తులు-ఎదుటి వ్యక్తి బలహీనతని- వైఫల్యాన్ని చూసి కామెంట్ చేసి మరీ మానసికంగా దిగ జార్చుతారు. అందుకే యిలా బ్రతుకు తున్నాను. ఇప్పుడు మీకు చెప్పక తప్పడంలేదు" ఆగాడు సతీష్.

ఉన్నదాన్ని మరుగుపరిచి చెప్పాడు సతీష్.

లేనిదాన్ని వున్నట్లు చెప్పాడు రాజా రావు.




"చూడండి- రాజారావుగారూ. ఎవరి జీవితాలు వాళ్ళవి. ఎవరి కష్టసుఖాలు వాళ్ళవి. మరీ పగటికలలు పనికిరావు. ఫ్యాన్ మేనియా మానసిక శాంతిని కాజేస్తుంది. నేను అంతా మరచి బ్రతుకు గడిపే ప్రయత్నం చేస్తున్నాను. సఫలత చెందుతున్నాను. మానసికంగా శారీరకంగా నేను నిబ్రద్రాణుక్కకో గలిగితేనే గదా-పోగొట్టుకున్నదానిని పొందగలిగేది. ఫాల్స్ ప్రిస్టేజి మనకొద్దు. ఏమంటారు?"

సాభిప్రాయంగా అతనివంక చూసాడు.

అతని కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి.

"మనం వాస్తవ జీవితంలో జీవిస్తూ పోరాడుదాం-రాజారావుగారూ పాత విలువలు ఎప్పుడో పోయాయి. కొత్త విలువలింకా ఏర్పడలేదు. వివాహ వ్యవస్థలో వున్నవాళ్ళు స్వేచ్ఛకోసం పోరాడుతూ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే- అదేదో థ్రిల్ అనే భ్రమలో యువతలవాళ్ళు అందులో బంధింపబడాలని కోరుకుంటున్నారు...ఇదో ఎండమావి...సహజీవనంకోసం వెదకాలే గాని మనకి తోడు దొరకదా" అన్నాడు సతీష్.

"థాంక్స్ సతీష్‌గారు-థాంక్స్- యిక ఊహా ప్రపంచంలోంచి వాస్తవంలోకి వచ్చేస్తాను" మెరిసే కళ్ళతో అన్నాడు రాజారావు.

ముగ్గురూ తేలికగా నిట్టూర్చారు.

ఒక విధంగా సతీష్ కూడా ఈ వంకన ఎస్కేపిజం నుంచి తప్పుకున్నాడు.

"ద గ్రేట్ ఎస్కేపిస్ట్" లోపల అనుకున్నాడు మోహన్. ●